## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**రామగిరి(నల్లగొండ) :** నల్లగొండ పట్టణంలోని రామగిరి రోడ్, కనకదుర్గ వీధి, శ్రీనివాస నగర్ కాలనీ, సావర్కర్‌నగర్, గాంధీ నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతులు చేస్తున్నందున గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టూ టౌన్ విద్యుత్ ఏడీ శంకరయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### పోస్టర్ విడుదల

**మర్రిగూడ :** ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 7న చేపట్టనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ నియోజకవర్గ పర్యవేక్షకుడు పోలేని యాదయ్యమాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చేపట్టనున్న మహా పాదయాత్ర పోస్టర్‌ను బుధవారం మండల కేంద్రంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు ముదిగొండ రమేష్, నాయకులు బుషిపాక నరేష్, కురంపల్లి అశోక్, జిల్లా నర్సింహ, చెక్కా రమేష్, చంటి, రమేష్, రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### బాధ్యతల స్వీకరణ

**చండూరు :** చండూరు మండల ఏఓగా రేవతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఫార్మా ట్రైనింగ్‌లో పనిచేస్తూ రేవతి బదిలీపై చండూరుకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఓ మల్లేశం యూరియా స్కాంలో సస్పెన్షన్‌కు గురయ్యారు.

### సాలూరి రాజేశ్వరరావుకు ఘన నివాళి

**రామగిరి(నల్లగొండ) :** నల్లగొండ పట్టణంలోని ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రంలో సిలువేరు సాహితీ సేవా కళాపీఠం ఆధ్వర్యంలో బుధవారం సినీ సంగీత దర్శకుడు సాలూరి రాజేశ్వరరావు 101వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రచయితలు సాలూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రచయితలు రఘువీర్, నరసింహ, దేవదానం, దాసోజు రవికుమార్, దాసోజు జ్ఞానేశ్వర్, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థికసాయం అందజేత

**మునుగోడు :** మండలంలోని చీకటిమామిడి గ్రామానికి చెందిన బోయపల్లి నిర్మల(40) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. ఆమె అంత్యక్రియలకు రూ.10వేల నగదు ఆ గ్రామ సర్పంచ్ తాటికొండ సంతోషసైదులు అందజేశారు. ఎనిమిదేళ్ల క్రితం నిర్మల భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వారి సంతానం ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. పాలకూరి యాదయ్య గౌడ్, ఏరుకొండ యాదయ్య, బోయపల్లి కృష్ణయ్య, రడం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### ఆధునిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

**నకిరేకల్ :** రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ రంగంలో ఆధునిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పీపుల్స్ మానిటరింగ్ కమిటీ జాతీయ కన్వీనర్ బీడీఏ సత్యబాబు బోస్ కోరారు. నకిరేకల్‌లో పీపుల్స్ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో వ్యవసాయ–వ్యవసాయ అనుబంధ రంగాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై బుధవారం జిల్లాస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు చిరుధాన్యాల పంటలు పండించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఐఆర్‌డీఎస్ అధ్యక్షుడు వాడపల్లి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పీఎంసీ రాష్ట్ర కన్వీనర్ సురుపంగి శివలింగం, ప్రతినిధులు సోమశేఖర్, రమేష్, భూపతి శ్రీను, ఎంపల్ల దశరథరెడ్డి, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె వాయిదా

**నల్లగొండ టౌన్ :** మధ్యాహ్న భోజన పథకం కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు యూనియన్ నాయకులు దండెపల్లి సత్తయ్య, పోతె సత్యనారాయణ తెలిపారు. సమ్మెను వాయిదా వేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని సహాయ సంచాలకులు రంగాచారికి బుధవారం లేఖ అందజేశారు. ఈ కార్యక్రమంలో అల్లి అనురాధ, దొడ్డి అండాలు, ఏకుల మహేశ్వరి, దండ పుష్పలత, వేముల ఇందిర, బొజ్జ అలివేలు, పందుల ముత్యాలి పాల్గొన్నారు.

### ఉచిత వైద్యశిబిరం

**నల్లగొండ టూటౌన్ :** పేదల కోసం ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయమని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శోభ కరంద్లాజే అన్నారు. నాగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండ పట్టణంలోని క్రాంతినగర్‌లో ఉచిత వైద్యశిబిరాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్యశిబిరానికి హాజరైన వారికి పలు రకాల పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మంత్రి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, డాక్టర్ సాహిత్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, దాయం భూపాల్‌రెడ్డి, పకీరు మోహన్‌రెడ్డి, కంకణాల నాగిరెడ్డి తదితరులు, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# తీరనున్న విద్యుత్ లో ఓల్టేజీ సమస్య

- రూ.2.61 కోట్లతో 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

**కేతేపల్లి :** మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ లో ఓల్టేజీ సమస్య నివారణకు గుడివాడ శివారులో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.2.61 కోట్లు నిధులు మంజూరయ్యాయి. దీంతో మండలంలోని ఐదు గ్రామాల రైతులు, వినియోగదారులకు విద్యుత్ లో ఓల్టేజీ ఇబ్బందులు తప్పనున్నాయి. సబ్‌స్టేషన్ పనులు ఇటీవలే ప్రారంభం కావడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేతేపల్లి మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. నలభై ఏళ్ల క్రితం అప్పటి అవసరాలకు అనుగుణంగా మండలంలో మూడు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. నాటినుంచి మండలానికి నూతనంగా ఒక్క సబ్‌స్టేషన్ కూడా మంజూరు కాలేదు. కాలక్రమేణా మండలంలో గృహ వినియోగదారులు, వ్యవసాయ బావులు, బోరు పంపుసెట్లు, పరిశ్రమలు, వాణిజ్య దుకాణాలు భారీగా పెరిగాయి. పెరిగిన విద్యుత్ అవసరాలకు అనుగుణంగా నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు కాకపోవడంతో లో ఓల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**ఒక్క సబ్‌స్టేషన్ కింద పది గ్రామాలు**

కేతేపల్లి, చీకటిగూడెం, ఉప్పలపహాడ్, కొత్తపేట, గుడివాడ, కాసనగోడు, బొప్పారం ఇప్పలగూడెం, కొర్లపహాడ్, ఇనుపాముల గ్రామాలకు కలిపి ఒక 33/11 కేవీ సబ్‌స్టేషన్ కేతేపల్లిలో ఉంది. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయ బావులు, బోర్లు, పరిశ్రమలు, గృహ విద్యుత్ కనెక్షన్లు భారీగా ఉండడంతో సబ్‌స్టేషన్‌పై ఓవర్‌లోడ్ పడి విద్యుత్ సరఫరాలో తరుచూ అంతరాయం కలుగుతోంది. ఇనుపాముల, కొర్లపహాడ్ ఫీడర్లు సబ్‌స్టేషన్ నుంచి 15 కిలోమీటర్ల దూరం ఉండడంతో చివరన ఉన్న ఆయా గ్రామాల్లో లూజ్ లైన్ల కారణంగా తరచూ ట్రిప్ అవుతోంది.



గుడివాడ శివారులో సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం చదును చేసిన స్థలం



శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే చిరుమర్తి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ (ఫైల్)

**ఐదు గ్రామాలకు లబ్ధి**

విద్యుత్ లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆయా గ్రామాల ప్రజలు పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించారు. స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చొరవతో గుడివాడ శివారులో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.2.61 కోట్ల నిధులు మంజూరు చేసింది. మూసీ కుడి ప్రధాన కాల్వ వెంట సేకరించిన రెండెకరాల భూమిలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఇటీవల రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శంకుస్థాపన చేశారు. సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయినట్లయితే కొత్తపేట, గుడివాడ, ఇప్పలగూడెం, కాసనగోడు, బొప్పారం గ్రామాల్లో విద్యుత్ లో ఓల్టేజీ సమస్య ఉండదని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు కేతేపల్లి సబ్‌స్టేషన్‌పై ఓవర్‌లోడ్ భారం తప్పనుంది. పనులు త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

**లో ఓల్టేజీ సమస్య ఉండదు**



ఎన్నో ఏళ్ల నుంచి విద్యుత్ లో ఓల్టేజీ సమస్య ఎదుర్కొంటున్నాం. సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయినట్లయితే లో ఓల్టేజీ సమస్య ఉండదు. రైతులు, వినియోగదారుల కష్టాలు తీరనున్నాయి. త్వరగా పనులు పూర్తిచేసి సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురావాలి.

–కట్ట శ్రవణ్, సర్పంచ్, గుడివాడ

# రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తాం

- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**నల్లగొండ రూరల్ :** కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు రూ. రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని భువగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ మండలంలోని జీకే అన్నారం, అన్నారెడ్డిగూడెం, ముశంపల్లి, ఐతవారిగూడెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్న వారికే దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి పథకాలు అందజేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ఏ పార్టీ అని చూడకుండా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేశామని తెలిపారు. ఏ గ్రామానికి వెళ్లినా ఇందిరమ్మ ఇళ్లే కనిపిస్తాయని అన్నారు. నిధులు, నియామకాలు, నీళ్లు, ఇంటికో ఉద్యోగం అని చెప్పి సీఎం కేసీఆర్ మాయమాటలతో ప్రజలను మోసం చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని రాష్ట్ర ప్రజలు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. జండూ బామ్‌లతో ఎడవడం, నటించడం తనకు రాదని, పేదల కన్నీళ్లు తూడవడం మాత్రమే తనకు తెలుసని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 75 స్థానాల్లో విజయ ఢంకా మోగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఎంపీటీసీ బీరం స్వాతి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ముఖ్య కార్యకర్తలతో కోమటిరెడ్డి సమావేశం**

**రామగిరి(నల్లగొండ) :** భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం తిప్పర్తి, మాడ్గులపల్లి మండలాల ముఖ్య కార్యకర్తలు, అనుచరులతో తిప్పర్తి మండలంలోని అనిశెట్టి దుప్పలపల్లిలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసి పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆయా మండలాల అధ్యక్షులు, పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా వాహనాల తనిఖీలు



మునుగోడు : వాహనాన్ని తనిఖీ చేస్తున్న మునుగోడు పోలీసులు

**చండూరు :** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చండూరు, గట్టుప్పల మండలాల్లో పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. మంగళవారం రాత్రి గుండ్రపల్లి దారిలో రూ.85 వేల నగదును పోలీసులు పట్టుకున్నారు. విచారణ అనంతరం ఆస్పత్రిలో వైద్య ఖర్చులకు ఆ నగదును తీసుకెళ్తున్నట్లుగా గుర్తించి తిరిగి అప్పగించారు.

**మునుగోడు :** ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరైనా తమ డబ్బులను రూ. 50వేల లోపు మాత్రమే తీసుకెళ్లాలని, అంతకన్నా ఎక్కువగా రవాణా చేస్తే సీజ్ చేస్తామని ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన పోలీస్ సిబ్బందితో కలిసి మండల వ్యాప్తంగా ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తీసుకెళ్తే సీజ్ చేస్తామన్నారు. ఆయన వెంట ఏఎస్‌ఐ ఖలీల్, కానిస్టేబుల్ రామనర్సయ్య, ఎల్లయ్య, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

**శాలిగౌరారం :** మండలంలోని వంగమర్తి సమీపంలో 365వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం ఎస్‌ఐ సతీష్ నేతృత్వంలో పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళికి లోబడి వ్యవహరించాలని, నిబంధనలను అతిక్రమించి వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

## డెంగ్యూతో బాలిక మృతి

**రామగిరి(నల్లగొండ) :** డెంగ్యూ జ్వరంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక మృతి చెందిన ఘటన బుధవారం తిప్పర్తి మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తికి చెందిన బద్దం రవి–రేష్మ దంపతుల రెండో కూతురు బద్దం జ్వాలిక(12) తిప్పర్తి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. 15 రోజుల క్రితం జ్వరం రావడంతో నల్లగొండలో వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ అని నిర్ధారణ అయింది. ఆరోగ్యం విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో హైదరాబాద్ కామినేని ఆస్పత్రికి తరలించారు. బుధవారం జ్వాలిక ఆరోగ్యం క్షీణించడంతో ఇంటికి తీసుకెళ్లమని కుటుంబ సభ్యులకు డాక్టర్లు చెప్పారు. అయితే కుటుంబ సభ్యులు తమ కుమార్తెను మరో ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించినప్పటికీ ఫలితం దక్కలేదు. మధ్యాహ్నం మృతి చెందింది.

# అంతర్జాతీయ బాలికల దినోత్సవం

**చండూరు :** అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ కవిత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత, టీచర్లు సునిత, కేదారి, నిర్మల ఆయాలు చిన్నారులు తల్లులు పాల్గొన్నారు.

**మర్రిగూడ :** బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల లీగల్ వలంటీర్లు కోరారు. బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూరిబా బాలికల పాఠశాలలో బాలికలకు బాల్య వివాహాల నిర్మూలన, లైంగిక వేధింపులు, లైంగిక దోపిడి, భ్రూణ హత్యలు, ర్యాగింగ్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీగల్ వలంటీర్లు పగడాల లింగయ్య, కొలుగూరి ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చండూరు : వేడుకల్లో పాల్గొన్న ఐసీడీఎస్ సిబ్బంది

## అక్రమ కట్టడాల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

**మునుగోడు :** మండల కేంద్రంలోని దుకాణాల సముదాయం వెనుక భాగంలో మురికి కాల్వను కబ్జా చేసి నిర్మించిన కట్టడాలను వెంటనే కూల్చివేయాలని ఎంపీడీఓ ఆర్.భాస్కర్‌గౌడ్ గ్రామ పంచాయతీ సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. మునుగోడులోని మురికి నీరు గ్రామ శివారులోకి వెళ్లేందుకు నిర్మించిన డ్రెయినేజీపై అక్రమ కట్టడాలు నిర్మించారు. ఇటీవల అధికారులు వాటిని తొలగించి నూతనంగా డ్రెయినేజీతోపాటు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. డ్రెయినేజీపై తిరిగి పలువురు దుకాణాల యజమానులు అక్రమ కట్టడాలు కడుతుండడంతో బుధవారం సాక్షి దిన పత్రికలో మళ్లీ మొదలైన అక్రమ కట్టడాలు అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు కబ్జా అయిన ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. అక్రమ కట్టడాలు కట్టిన వ్యక్తులు స్వచ్ఛందంగా తొలగించాలని, లేదంటే తమ సిబ్బంది కూల్చివేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి, పంచాయతీ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

# ఖాతాదారులకు చేరువలో సహకార బ్యాంకు



మొబైల్ ఏటీఎం ద్వారా నగదు డ్రా చేస్తున్న రైతు

**రామగిరి(నల్లగొండ) :** సహకార బ్యాంకు ద్వారా ఖాతాదారులకు మరిన్ని సేవలు అందుబాటులో ఉన్నాయని తిప్పర్తి సహకార సంఘం చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి అన్నారు. బుధవారం తిప్పర్తి మండలంలోని కంకణాలపల్లిలో కోఆపరేటివ్ బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా నూతనంగా యూపీఐ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. బ్యాంకులో అన్ని రకాల రుణాలు పొందే సదుపాయం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోన జానయ్య, నల్లగొండ బ్రాంచ్ మేనేజర్ వి.భాగ్యశ్రీ, ఫీల్డ్ ఆఫీసర్ శేఖర్‌రెడ్డి, తిప్పర్తి సంఘ కార్యదర్శి అవినాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించాలి

**చండూరు :** ఎన్నికల కమిషన్ ఆదేశాలను అందరు పాటించాలని ఈఆర్‌ఓ దామోదర్‌రావు అన్నారు. బుధవారం చండూరులో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నాయకులు అధికారులకు సహకరించాలన్నారు.



చండూరు : మాట్లాడుతున్న ఆర్‌ఓ దామోదర్‌రావు

**మిర్యాలగూడ:** రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని, నిబంధనలను అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ చెన్నయ్య అన్నారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో మొత్తం 263 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అన్ని కేంద్రాల్లో విద్యుత్, తాగు నీరు, మరుగుదొడ్లు, వృద్ధులు, వికలాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అక్టోబర్ 31లోపు ఓటు హక్కుకు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పోలింగ్ తేదీ కంటే ఐదు రోజులు ముందుగా ఇంటింటికీ ఓటరు స్లిప్పులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లే వాహనదారులు తప్పనిసరిగా వాటికి సంబంధించిన ధ్రువపత్రాలు చూపించాలన్నారు. రాజకీయ నాయకులు ర్యాలీలు, మైక్ సెట్ ప్రచారాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు.

## చిన్నారులకు అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న సూపర్‌వైజర్ యశోద

**మర్రిగూడ :** మండలంలోని తూర్పుతండా అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద పాల్గొని మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పాలు, చిరుధాన్యాలను ఆహారంగా తీసుకున్నట్లయితే రక్తహీనతకు గురికాకుండా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నాయకుల ఇంటింటి ప్రచారం

**కట్టంగూర్ :** కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్టంగూర్‌లో బుధవారం ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గాజుల సుకన్య, పట్టణ అధ్యక్షుడు చెరుకు యాదగిరి, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మేడి ఈశ్వరమ్మ, జిల్లా కార్యదర్శి బండగొర్ల సుజాత, లక్ష్మి, ధనమ్మ, సుచరిత పాల్గొన్నారు.

## వేముల వీరేశాన్ని కలిసిన విద్యార్థి సంఘం నాయకులు

**నకిరేకల్ :** మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని నకిరేకల్‌లోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ నాయకులు కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అల్లి అంజన్‌యాదవ్, శ్రీపతి గణేశ్, తన్నీరు శ్రావణ్, రాచకొండ భరత్‌గౌడ్, సురేష్, సాయి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాల ఫలితమే తెలంగాణ

**మర్రిగూడ :** నాటి అమరవీరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని బీఎస్పీ మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆందోజు శంకరాచారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శాలివాహన జూనియర్ కళాశాలలో మహనీయుల పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో పొలిటికల్ ఫ్రంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నారపాక అంజి అధ్యక్షతన ఎటుపాయే విద్యార్థి ఉద్యమ త్యాగాలు అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శంకరాచారి పాల్గొని మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఏ వర్గానికి న్యాయం జరగలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నక్క గిరి, పొలిటికల్ ఫ్రంట్ నియోజకవర్గ చైర్మన్ మల్ల యాదయ్య, అవ్వారి వేణుకుమార్, జిల్లా వెంకటేష్, నెల్లికంటి రాఘవేంద్రయాదవ్, కోరె సాయిరాం, వడ్డె వెంకటేష్, గనం నర్సింహ, సంజీవ, పొట్టిపాక శ్రీనివాస్, రమేష్, మారయ్య, రవి, నారపాక సైదులు, ఏర్పుల శంకర్, సుధాకర్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

## బూత్ కమిటీల నియామకం

**చిట్యాల :** మండలంలోని వెంబాయి, తాళ్లవెల్లెంల, ఎలికట్టె గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ బూత్ కమిటీలను బుధవారం నియమించారు. వెంబాయి గ్రామ పోలింగ్ బూత్ ఇన్‌చార్జ్‌గా ఆదే నర్సింహ, తాళ్లవెల్లెంల గ్రామ బూత్ కమిటీ ఇన్‌చార్జ్‌లుగా మామిడాల పాండు, బత్తుల వెంకన్న, ఎలికట్టె బూత్ కమిటీ ఇన్‌చార్జ్‌లుగా మండల శ్రీనివాస్, ఉయ్యాల కృష్ణయ్య నియామకమయ్యారు. ఆయా కార్యక్రమాల్లో చిట్యాల మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఆవుల అయిలయ్య, పీఏసీఎస్ చైర్మన్ రుద్రారపు భిక్షం, మండల ప్రధానకార్యదర్శి కల్లూరి మల్లారెడ్డి, కొలను వెంకటేష్‌గౌడ్, సుంకరి యాదగిరిగౌడ్, జనగాం నర్సింహగౌడ్, కొలను సతీష్‌గౌడ్, తుమ్మల నాగరాజురెడ్డి, బోగరి నర్సింహ పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి

**నకిరేకల్ :** మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డుకు చెందిన వివిధ పార్టీల నాయకులు బుధవారం నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరినవారిలో తండు లింగయ్య, చనగాని జనార్దన్, వెంకన్న, తండె అంజయ్యతోపాటు మరి కొంతమంది ఉన్నారు. అనంతరం నకిరేకల్‌లోని ఫొటోగ్రాఫర్స్ యూనియన్ నాయకులు తమకు కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరుతూ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రాచకొండ వెంకన్న, చెవుగోని సైదులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగాన్ని కాపాడుకోవాలి

**రామగిరి(నల్లగొండ) :** కార్పొరేట్ కబంధ హస్తాల నుంచి విద్యా రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థి లోకానికి ఉందని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర నాయకుడు పందుల సైదులుగౌడ్ అన్నారు. బుధవారం నల్లగొండలోని టీఎన్జీఓ కార్యాలయంలో పీడీఎస్‌యూ(విజృంభన) జిల్లా కమిటీ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పీడీఎస్‌యూ(విజృంభన) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లెబోయిన జాని అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రాయిసిడం బాబురావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి బెల్లి నాగరాజు, రైతు కూలీ పోరాట సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బొమ్మకంటి కొమరయ్య, శ్రీను పాల్గొన్నారు.

## ఎంజీయూ అధ్యాపకుడికి డాక్టరేట్



వేణుగోపాల్‌రెడ్డి

**నల్లగొండ టూటౌన్ :** కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో పరిశోధన చేసిన ఎంజీయూ అధ్యాపకుడు సీహెచ్. వేణుగోపాల్‌రెడ్డికి డాక్టరేట్ లభించింది. రోల్ ఆఫ్ కమర్షియల్ బ్యాంక్స్ ఇన్ ప్రమోటింగ్ రూరల్ ఎంట్రపెన్యూర్‌షిప్ ఎ స్టడీ అనే అంశంపై వేణుగోపాల్‌రెడ్డి పరిశోధన చేశారు. వేణుగోపాల్‌రెడ్డి చేసిన పరిశోధనకు గాను కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య మల్లారెడ్డి డాక్టరేట్ ప్రకటించారు.

## గ్రామశాఖ అధ్యక్షుడిగా నర్సింహ

**కనగల్ :** బాబాసాహెబ్ గూడెంకు చెందిన మేకల నర్సింహను కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుంకిరెడ్డి రమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న నారాయణ స్కూల్ విద్యార్థినులు



బతుకమ్మలతో విద్యార్థినులు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న డాన్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

**నల్లగొండ :** బతుకమ్మ సంబరాలను నల్లగొండ పట్టణంలోని నారాయణ స్కూల్, పానగల్ రోడ్‌లోని శ్రీనగర్‌లో డాన్ స్కూల్, ఎన్జీ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు ప్రసాద్, డీన్ నిరంజన్, బిజూ జోసఫ్, సైదులు, శ్రావన్, కోఆర్డినేటర్లు రవిశంకర్, సింధు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు తరుణ్‌రెడ్డి, ఆదిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అను, బిందు, పావని, మంజులత, స్వాతి, రోజా, జిస్నా, ప్రమీల, సినిమోల్ జార్జ్, ఆశ, అంజలి, గాయత్రి, అనూష, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మార్పునకు శ్రీకారం చుట్టాలి

**రామగిరి(నల్లగొండ):** నూతన సామాజిక మార్పునకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉందని బీఆర్‌ఎస్ అసమ్మతి నేత పిల్లి రామరాజు అన్నారు. బుధవారం తిప్పర్తి మండల కేంద్రంలో తిప్పర్తి, మాడ్గులపల్లి మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. తిప్పర్తి, మాడ్గులపల్లి మండలాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## మునుగోడు టికెట్ ముదిరాజ్‌లకు ఇవ్వాలి

**నల్లగొండ టౌన్ :** మునుగోడు నియోజకవర్గ టికెట్ ముదిరాజ్‌లకు కేటాయించాలని ముదిరాజ్ సంఘం నాయకులు రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ముదిరాజ్ కులస్తుల సమ్మేళనంలో వారు మాట్లాడారు. ఈ నెల 15న చండూరులో జరగనున్న ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభకు ముదిరాజ్ కులస్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్‌లను గుర్తించకపోతే ఆ పార్టీలకు మద్దతు ఇవ్వబోమని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ నేత నారబోయిన రవి అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో కేశబోయిన శంకర్‌ముదిరాజ్, లోకనబోయిన వెంకటరమణ, దోటి శ్రీనివాస్, నల్లా సోమమల్లయ్య, లోకనబోయిన రమణ, బోళ్ల వెంకట్ పాల్గొన్నారు.